నమస్తే తెలంగాణ
జనగామ
3 | గురువారం 21 మార్చి 2024 | JANAGAON

# ఫ్యాన్సీ నంబర్ల క్రేజీ



వాహనాల రిజిస్ట్రేషన్ కోసం బారులు తీరిన వాహనదారులు

## ఆర్టీఏలో యమ రద్దీ

వరంగల్, మార్చి 20: కొత్త వాహనాల రిజిస్ట్రేషన్లతో హనుమకొండ ఆర్టీఏ కార్యాలయం కళకళలాడుతోంది. వాహన రిజిస్ట్రేషన్‌దారులతో రద్దీగా ఉంది. ఉదయం 10 గంటల నుంచే వాహన రిజిస్ట్రేషన్ల కోసం క్యూలు కడుతున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం టీఎస్ స్థానంలో టీజీ తీసుకొచ్చి కొత్త నంబర్లను కేటాయిస్తున్న తరుణంలో వాహనదారులు ఫ్యాన్సీ నంబర్ల కోసం క్రేజీ చూపిస్తున్నారు. మొదటి రోజు టీజీ 0001, 0006, 0009, 0036 నంబర్ల కోసం వాహనదారులు పోటీలు పడ్డారు. చివరికి బిడ్డింగ్ ద్వారా రూ. లక్షలు వెచ్చించి ఫ్యాన్సీ నంబర్లను దక్కించుకున్నారు.

## జాతీయ సమైక్యతా శిబిరానికి కేయూ టీమ్

హనుమకొండ చౌరస్తా, మార్చి 20: 22 నుంచి 28 వరకు కర్ణాటకలోని జానపద లోక రాంనగర్‌లో నిర్వహించే జాతీయ సమైక్యతా శిబిరానికి కాకతీయ విశ్వవిద్యాలయ టీమ్‌ను ఎంపిక చేసినట్లు జాతీయ సేవా పథకం ప్రోగ్రాం సమన్వయ అధికారి ఆచార్య ఈసం నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో టీ మనోజ(టీటీడబ్ల్యూఆర్‌డీసీ ఉమన్, మహబూబాబాద్), బీ ఇందుప్రియ (ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ, ఖమ్మం), రోషిణి(కిట్స్ కాలేజీ, హనుమకొండ), పీ మనస్విత (యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ, హను మకొండ), జే హర్షిత (యూనివర్సిటీ మహిళా ఇంజినీరింగ్ కళాశాల, హనుమకొండ), సీహెచ్ శివశంకర్ (ఎల్బీ కాలేజీ, వరంగల్), జీ రాజు (టీటీడబ్ల్యూఆర్డీసీ బాయ్స్, మణు గూరు), బీ సూర్యకాంత్ (ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కాలేజీ, ఆదిలాబాద్), జే మహేష్ (వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కాలేజీ, హనుమకొండ), జీ దిలీప్‌కుమార్ (కేయూ కాలేజీ అఫ్ ఇంజి నీరింగ్ అండ్ టెక్నాలజీ) ఉన్నారు. వీరికి హనుమకొండ ప్రభుత్వ వృత్తి విద్య జూనియర్ కాలేజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ కాంటింజెంట్ లీడర్‌గా వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. వైస్ చాన్స్‌లర్ ఆచార్య తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ఆచార్య పీ మల్లారెడ్డి వలంటీర్లను అభినందించారు.

# 24X7..

- కమిషనరేట్ పరిధిలో 24చెక్ పోస్ట్‌లు
- ఆధారాలు లేకుండా రూ.50వేలకు పైగా నగదు తీసుకెళ్తే సీజ్

## పకడ్బందీగా తనిఖీలు..

*సుబేదారి, మార్చి20 : పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తనిఖీలు ముమ్మరమయ్యాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో మాడల్ కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు సీపీ అంబర్ కిశోర్ ఝా చర్యలు చేపట్టారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేయకుండా నగదు రవాణాను అరికట్టేందుకు కమిషనరేట్ పరిధిలో 24 చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు సీపీ సైతం చెక్‌పోస్టులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు తనిఖీలు రాత్రింబవళ్లు కొనసాగనున్నాయి. ప్రతి చెక్ పోస్ట్ వద్ద బందోబస్తు కోసం కేంద్ర పారా మిలటరీ బలగాలు మోహరించాయి.*

లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్ జిల్లా నర్సంపేట అయ్యప్ప గుడి, నల్లబెల్లి మండలం బొల్లోనిపల్లి, ఖానాపూర్ మండలం అశోక్‌నగర్, వరంగల్ ఎంజీఎం దవాఖాన జంక్షన్, వరంగల్ లేబర్ కాలనీ–జాన్‌పాక, ఖమ్మం రోడ్డు నాయుడు పెట్రోల్ పంపు, రాయపర్తి డీసీ తండా, చింత నెక్కొండ, గీసుగొండ మండలం కొమ్మాల, హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్, ఎల్కతుర్తి మండలం పెంచికలపేట, ఆత్మకూరు మండలం కటాక్షపూర్, నడికూడ, ములుగురోడ్డు హన్‌మాన్ జంక్షన్, హంటర్‌రోడ్డు సీఎస్ఆర్ గార్డెన్, కాజీపేట డీజిల్‌కాలనీ, రాంపూర్, జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం జీడికల్, జఫర్‌గఢ్ మండలం నల్లబండ, రాయపర్తి–కిష్టాపూర్ క్రాస్‌రోడ్డు, జనగామ సమీపంలోని పెంబర్తి, తరిగొప్పుల మండలం ఈన్యానాయక్ తండా, బచ్చన్నపేట మండలం కొన్నె క్రాస్ రోడ్డు వద్ద చెక్‌పోస్టులు నెలకొల్పారు. ప్రతి చెక్ పోస్ట్ వద్ద స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు ఉంటాయి. సీఆర్‌పీఎఫ్ కేంద్ర బలగాలు, స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు ఉంటారు. తనిఖీలను వీడియో రికార్డు చేస్తారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.50వేలపైన నగదు గానీ, ఓటర్లను ప్రభావితం చేసే వస్తువులు గానీ ఉంటే సీజ్ చేస్తారు. నగదు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు ఉంటేనే వదిలిపెడతారు. పట్టుబడ్డ నగదును సీజ్ చేసి జిల్లా స్థాయిలో గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తారు.



వరంగల్ లేబర్ కాలనీ –గొర్రెకుంట క్రాస్‌రోడ్డు వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఎస్ టీమ్స్



జనగామ: పెంబర్తి చెక్‌పోస్టు వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఏసీపీ దామోదర్‌రెడ్డి

### ఎక్కువ నగదు ఉంటే ఆధారాలు చూపాలి



పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పకడ్బందీగా మాడల్ కోడ్ అమలు చేస్తున్నాం. కమిషనరేట్ పరిధిలో 24 చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేశాం. ఈ నెల 16నుంచి స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు చెక్ పోస్టుల వద్ద తనిఖీలు చేస్తున్నాయి. రూ.50వేల లోపు మాత్రమే నగదు తీసుకెళ్లేందుకు అనుమతి ఉంది. దానికి కూడా ఆధారాలు చూపించాలి. రూ.50వేలకు పైన నగదును ఎలాంటి ఆధారాలు లేకుండా కలిగి ఉంటే సీజ్ చేసి జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అందిస్తాం.

*–అంబర్ కిశోర్ ఝా, వరంగల్ పోలీస్ కమిషనర్*



దేవరుప్పుల మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

# రోడ్డెక్కిన వర్గపోరు

## దేవరుప్పలలో భగ్గుమన్న విభేదాలు

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడి మార్పు**

- శ్రీరామ్‌ను నియమించిన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి
- పెద్ది కృష్ణమూర్తి వర్గం రాస్తారోకో
- పార్టీ కార్యాలయంపై దాడి
- ఝాన్సీరెడ్డిపై తీవ్ర ఆరోపణలు

దేవరుప్పుల, మార్చి 20: మండల కాంగ్రెస్‌లో వర్గపోరు తారస్థాయికి చేరింది. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిని మార్చడంతో విభేదాలు భగ్గుమన్నాయి. చాలాకాలంగా ఉన్న గ్రూపు తగాదాలు పార్టీ మండల అధ్యక్షుడి మార్పుతో రోడ్డెక్కాయి. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా రెండేళ్లుగా కొనసాగుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కీలకంగా పనిచేసిన దేవరుప్పులకు చెందిన పెద్ది కృష్ణమూర్తిని తొలగించి, నీర్మాల గ్రామానికి చెందిన ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్రీరామ్‌కు ఆ బాధ్యతలను పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి మంగళవారం అప్పగించారు. కృష్ణమూర్తి ఒంటెత్తు పోకడలు పోతున్నారని, కార్యకర్తలు, నాయకులకు సమాచారం ఇవ్వడంలేదనే ఫిర్యాదులు రావడంతో పలుమార్లు తీరు మార్చుకోవాలని చెప్పినా నిర్లక్ష్యం వహించడంతో ఝాన్సీరెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఈమేరకు మంగళవారం తొర్రూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కృష్ణమూర్తిని తొలగించి ఆ స్థానంలో శ్రీరాం నియామకాన్ని ప్రకటించి ఆయనను సన్మానించారు. ఈ నిర్ణయానికి మండలంలోని 27 గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల ఆమోదం ఉందని నల్ల శ్రీరాం చెబుతున్నారు.

### ఆందోళనకు దిగిన కృష్ణమూర్తి వర్గం

మండల అధ్యక్షుడి మార్పుతో పెద్ది కృష్ణమూర్తి వర్గం మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం పెద్ద ఎత్తున మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. ఆయన తొలగింపు అప్రజాస్వామికమని, నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. పెద్ద పెట్టున నినాదాలు చేశారు. పోలీసులు వచ్చి ఆందోళన విరమింపజేశారు. పలు గ్రామాల మహిళలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళనలో పాల్గొని ఝాన్సీరెడ్డిని దుయ్యబట్టారు. వనరులు దోచుకునేందుకే కృష్ణమూర్తిని ఆ పదవి నుంచి తొలగించి, శ్రీరాంకు అప్పగించారని బాహాటంగా ఆరోపించారు. వానకొండయ్య గుట్టపై క్వారీ పనులు చేయడాన్ని వ్యతిరేకించడంతోపాటు వాగు నుంచి టిప్పర్లలో ఇసుక తరలింపును వ్యతిరేకిస్తున్నందున వల్లే కృష్ణమూర్తిని పదవి నుంచి తొలగించారని వారు ఝాన్సీరెడ్డిపై విమర్శలు చేశారు.

### కాంగ్రెస్ కార్యాలయంపై దాడి

దేవరుప్పుల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఉదయం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇనుమలు నాగరాజు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నల్ల శ్రీరాంకు మండల అధ్యక్ష పదవి కట్టబెట్టిన పరిణామాలపై మాట్లాడుతుండగా కృష్ణమూర్తి వర్గం కార్యాలయంపై దాడికి దిగింది. అందులోని ఫర్నిచర్‌ను విసిరేసి, చెల్లాచెదురు చేశారు. మీరంతా ఎన్నికల సమయంలో ఎటుపోయారని, కష్టపడి పనిచేసిన కృష్ణమూర్తిని ఎలా తొలగిస్తారని కార్యకర్తలు నిలదీశారు. అక్కడ ఎమ్మెల్యే యశస్విని, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి ఫొటోలు ఉన్న ఫ్లెక్సీలను ధ్వంసం చేశారు. పోలీసులు వచ్చి ఇరు వర్గాలను చెదరగొట్టడంతో గొడవ సద్దుమణిగింది. అనంతరం పోలీసులు కాంగ్రెస్ కార్యాలయ షట్టర్లను కిందికి వేసి కాపలా ఉన్నారు.



ఎమర్జెన్సీ వార్డులో ఎక్స్‌రే మిషన్ పనిచేయకపోవడంతో రేడియోగ్రఫీ గదికి తాళం వేసిన సిబ్బంది



ఎక్స్‌రే మిషన్ పని చేయకపోవడంతో గది ద్వారానికి అడ్డుగా కబోర్డు ఏర్పాటు చేసిన సిబ్బంది

## అధికారుల అలసత్వం..
# రోగులకు శాపం

- ఎంజీఎం ఎమర్జెన్సీ వార్డులో పనిచేయని ఎక్స్‌రే మిషన్
- నాలుగు రోజులైనా మరమ్మతులు శూన్యం
- ఇబ్బందులు పడుతున్న రోగులు, అటెండెంట్లు
- మంత్రి సమీక్షించినా మారని అధికారుల తీరు

వరంగల్‌చౌరస్తా, మార్చి 20: ఎంజీఎం దవాఖాన ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కు. ఎన్నో వ్యయప్రయాసాల కోర్చి ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల నుంచి వందలాది మంది ప్రజలు వివిధ ఆరోగ్య సమస్యలతో నిత్యం వస్తుంటారు. అలాగే, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని ఎంజీఎం హాస్పిటల్‌లోని ఎమర్జెన్సీ వార్డుకు తరలిస్తుంటారు. ఈ క్రమంలో క్షతగాత్రుల ఎముకల స్థితిని తెలుసుకునేందుకు ఎక్స్‌రే అవసరం ఉంటుంది. అయితే, నాలుగు రోజుల నుంచి ఎక్స్‌రే మిషన్ పనిచేయడం లేదు. దీంతో క్షతగాత్రులు, అటెండెంట్లు నానా అవస్థలు పడుతున్నారు. ఈ నెల 18న మధ్యాహ్నం ఎక్స్‌రే మిషన్ మొరాయించింది. అప్పటినుంచి ఎమర్జెన్సీ వార్డులో సేవలు నిలిచిపోయాయి. అత్యవసర పరిస్థితిలో చికిత్స పొందుతున్న రోగిని సైతం స్ట్రెచర్‌పై రేడియాలజీ విభాగానికి తరలించాల్సి వస్తున్నా అధికారులు మరమ్మతుల విషయంపై స్పందించడం లేదని అటెండెంట్లు వాపోతున్నారు. అత్యవసర విభాగంలో ఎక్స్‌రే అందుబాటులో లేకపోవడంతో వైద్యసిబ్బంది సైతం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. అలాగే, రేడియాలజీ విభాగానికి తరలించే క్రమంలో అంతర్గత రోడ్లు సరిగా లేక క్షతగాత్రులు తీవ్ర నొప్పిని భరించాల్సి వస్తున్నదని వారి బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులతో సమీక్షించారు. అయినా అందుకు తగిన విధంగా స్పందించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# సీఎస్‌కు మంత్రి పొన్నం ఫిర్యాదు

కమలాపూర్, మార్చి 20: తన ఫోన్ కాల్‌ను రికార్డ్ చేసి లీక్ చేశారన్న ఆరోపణలతో గత ఆర్డీవోపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి ఫిర్యాదు చేశారు. 'గత ప్రభుత్వంలో హుజూరాబాద్ ఎమ్మెల్యేగా ఈటల రాజేందర్ ఉంటే అధికార పార్టీ ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి చేతుల మీదుగా కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయించిండ్రు. ఇప్పుడు కౌశిక్‌రెడ్డి అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే కాదు. మా కాంటెస్ట్ అభ్యర్థి ప్రణవ్ చేతుల మీదుగా, లేదంటే అధికారులే నేరుగా వెళ్లి లబ్ధిదారులకు చెక్కులు అందజేయాలి. ఒక్క చెక్కు ఎమ్మెల్యే చేతికి పోయినా బాగుండదు ' అని మంత్రి పొన్నం అప్పటి ఆర్డీవో, కమలాపూర్ తహసీల్దార్ మాధవికి ఆదేశాలు జారీ చేసిన ఆడియో ఐదు రోజుల క్రితం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో తన ఫోన్ కాల్ లీక్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఎస్‌కు మంత్రి ఫిర్యాదు చేశారు. కాగా, జనవరిలో కమలాపూర్ మండలంలోని కన్నూరు పంచాయతీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ప్రారంభించకుండా మంత్రి అడ్డుకున్నారు. ఎమ్మెల్యే సంయమనం పాటించి సర్పంచ్‌ల పదవీ కాలం ముగుస్తుండడంతో కార్యాలయ భవనం ప్రారంభానికి వచ్చానని, ప్రొటోకాల్ ప్రకారం మంత్రులు వస్తానంటే తనకు అభ్యంతరం లేదన్నారు. అనంతరం జనవరి 31లోపు మంత్రులు సమయం తీసుకుని ప్రారంభించాలని, లేదంటే తానే ప్రారంభిస్తానని ఎమ్మెల్యే మీడియా సమావేశం పెట్టి చెప్పారు. మంత్రుల కోసం వేచి చూసినా రాకపోవడంతో ఎమ్మెల్యేనే నూతన భవనాలను ప్రారంభించారు. ఈ సమస్య ముగిసిపోవడంతో ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ తహసీల్దార్, ఆర్డీవోతో మాట్లాడిన ఆడియో లీక్ కావడంతో ఎమ్మెల్యేపై మంత్రి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని మండలంలో చర్చ జరుగుతోంది.

# ప్రతి జిల్లాలో క్రికెట్ మైదానాలు

**శాట్ హాస్టల్‌ను తరలిపోకుండా చూస్తా**

**హెచ్‌సీఏ, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జగన్మోహన్‌రావు**

హనుమకొండ చౌరస్తా, మార్చి 20: ప్రతి జిల్లాలో క్రికెట్ మైదానాలు ఏర్పాటు చేస్తామని, మొదటిది వరంగల్‌లోనే ప్రారంభిస్తామని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ప్రెసిడెంట్, తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్‌రావు అన్నారు. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జనరల్‌బాడీ మీటింగ్, ఎన్నికలు బుధవారం హనుమకొండలో జరిగాయి. ముఖ్య అతిథిగా జగన్మోహన్‌రావు పాల్గొని మాట్లాడుతూ క్రికెట్, హ్యాండ్‌బాల్ తనకు రెండు కళ్లలాంటివని, హ్యాండ్‌బాల్ స్ఫూర్తితో క్రికెట్‌కు వచ్చానన్నారు. గొప్ప క్రీడాకారులు వరంగల్‌లో ఉన్నారని, ఇక్కడ ఉన్న శాట్ హాస్టల్‌ను తరలిపోకుండా చూస్తానన్నారు. త్వరలో వరంగల్‌లో స్పోర్ట్స్, క్రికెట్ క్లబ్ పెట్టేందుకు విధివిధానాలను రూపొందించాలని ఆయన అసోసియేషన్ నాయకులను కోరారు. ఏప్రిల్, మేలో వరంగల్‌లో 200 మంది క్రీడాకారులను ఎంపిక చేసి హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. త్వరలో క్రికెట్ అకాడమీలు ఏర్పాటు చేస్తామన్నారు. క్రీడాకారులకు అక్షర గ్రూప్ ద్వారా తన వంతుగా సహాయసహకారాలు అందిస్తానన్నారు. ఈ సందర్భంగా హ్యాండ్‌బాల్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావును జగన్మో హన్‌రావు అభినందించారు. అనంతరం ఏప్రిల్ 25 నుంచి 27 వరకు ఖిలావరంగల్‌లో జరిగే ఫస్ట్ తెలంగాణ హ్యాండ్‌బాల్ ప్రీమియర్ లీగ్ పోటీల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాకతీయుల కళాతోరణంతో కూడిన జ్ఞాపికను జగన్మోహన్‌రావుకు అందజేశారు. కార్యక్రమంలో ఒలింపిక్స్ ఉమ్మడి వరంగల్ అధ్యక్షుడు మహమ్మద్ అజీజ్‌ఖాన్, కార్యదర్శి కైలాస్‌యాదవ్, అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, హెచ్‌సీఏ వరంగల్ అధ్యక్షుడు చాగంటి శ్రీనివాస్, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

### వరంగల్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నాగేశ్వర్‌రావు

హ్యాండ్‌బాల్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఇండ్ల నాగేశ్వర్‌రావును ఎన్నుకున్నారు. కార్యదర్శిగా బొద్దు విష్ణువర్ధన్‌రెడ్డి, కోశాధికారిగా నరేందర్‌బాబు, చైర్మన్‌గా ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పోగుల అశోక్, జాయింట్ సెక్రటరీగా అశోక్, సభ్యులుగా సంతోష్, శ్రీధర్, చందర్, వీరస్వామిని ఎన్నుకున్నట్లు తెలిపారు.



ఫస్ట్ తెలంగాణ హ్యాండ్‌బాల్ ప్రీమియర్ లీగ్ పోటీల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు









ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఎనుమాముల మార్కెట్ ప్రధాన ద్వారం, కుటుంబ సమేతంగా ఉన్న రైతు బొమ్మ

# బొమ్మ అదిరె.. రైతు మురిసె

*ప్రత్యేక ఆకర్షణగా ఎడ్లబండితో అన్నదాత కుటుంబం ప్రతిమ*

*ప్రారంభోత్సానికి సిద్ధంగా ఎనుమాముల మార్కెట్ ప్రధాన ద్వారం*

అది ఆసియా ఖండంలోనే అతిపెద్ద మార్కెట్. వేలాది మంది రైతులు తాము పండించిన వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలిస్తుంటారు. దీంతో నిత్యం రద్దీగా ఉంటుంది. అన్నదాత సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్ ఎనుమాముల మార్కెట్ యార్డును 2023లో అభివృద్ధి చేశారు. ఇందులో భాగంగా ప్రధాన ద్వారం వద్ద ఓ రైతు తాను పండించిన వ్యవసాయ ఉత్పత్తులను ఎడ్లబండిపై తీసుకొని కుటుంబ సభ్యులతో కలిసి మార్కెట్‌కు వస్తున్నట్లు నమూనా ఏర్పాటు చేయించారు. ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నది. ఎంతో కలర్‌ఫుల్‌గా ఉన్న ఈ చిత్రాన్ని మార్కెట్‌కు వచ్చే రైతులతోపాటు దారి వెంట వెళ్తున్న వారు సైతం ఆగి.. నమూనా చిత్రం వద్ద నిల్చొని సెల్ఫీలు దిగుతూ మురిసిపోతున్నారు.

– వరంగల్ ఫొటోగ్రాఫర్